క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డికి వాసుపల్లి శుభాకాంక్షలు



వైవీ సుబ్బారెడ్డిని కలసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం: టీటీడీ చైర్మన్, విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం జిల్లాల వైఎస్సార్‌సీపీ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని శనివారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

జెడ్సీని మర్యాదపూర్వకంగా కలిసిన పద్మావతి



జెడ్సీ శివప్రసాద్‌కు మొక్కను బహుమతిగా అందజేస్తున్న తోట పద్మావతి

అల్లిపురం: ఇటీవల బదిలీపై జోన్–4 జోనల్ కమిషనర్‌గా వచ్చిన శివప్రసాద్‌ను 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి శనివారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు అభివృద్ధికి సహకరించాలని జెడ్సీని కోరారు. ఆయనను కలసిన వారిలో వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు లింగం శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

బల్లిగిరి వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వెంకన్నను ధనుర్మాసం మూడవ శనివారం సందర్భంగా భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. తెల్లవారుజాము 4 గంటల నుండి స్వామి వారికి ఆలయ అర్చకులు సుప్రభాతసేవ, తోమాలసేవ అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ సందర్భంగా శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామికి భక్తుల గోత్రనామాల పేరిట సహస్ర నామాభిషేకాలు చేశారు.

చిన్నారుల సంక్రాంతి సంబరాలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు పార్వతీ నగర్‌లోని అన్నూర్ ప్లే–స్కూల్‌లో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. చిన్నారులు హరిదాసు వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. నిర్వాహకులు చిన్నారులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ షేక్ ఫరీద్ మాట్లాడుతూ సంక్రాంతి పండగ అన్ని వర్గాల వారికి చెందినదన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ షహరత్ బీబీ, ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

హార్బర్ ఆధునికీకరణకు చర్యలు



మంత్రి అప్పలరాజును సత్కరిస్తున్న వాసుపల్లి జానకిరామ్ తదితరులు

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులకు సంబంధించి కలెక్టర్, పోర్టు చైర్మన్ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించి మౌలిక వసతుల కల్పనకు తగిన ఏర్పాట్లు చేస్తామని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శనివారం ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హార్బర్ ఆధునికీకరణకు రూ. 152 కోట్లు మంజూరు చేశామన్నారు. మత్స్య పరిశ్రమ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు జానకిరామ్ మాట్లాడుతూ మత్స్యకారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, ఏపీ మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ పేర్ల విజయచందర్, కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, డాల్ఫిన్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి వీరన్న, ఏపీ మెకనైజ్డ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు, మైలపల్లి నరసింహులు, దూడ పోలయ్య, గుంటు దానయ్య, ఎ.చిన్నఎర్రయ్య, పి.ఈశ్వరరావు, జి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి అప్పలరాజుకు వల, టోపీ, చేప అందజేసి సత్కరించారు.

ఏవీఎన్‌లో మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్



సమావేశంలో మాట్లాడుతున్న అతిథి

డాబాగార్డెన్స్: నగరంలోని ఏవీఎన్ కళాశాలలో స్టీల్ సిటీ సెక్యూరిటీస్ ఆధ్వర్యంలో శనివారం మెగా ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు పర్యవేక్షణలో నిర్వహించిన డ్రైవ్‌లో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ ప్రతిభ ఉంటే రాణించడం సులభమని, చదువుతున్న క్రమంలోనే ఉద్యోగావకాశాలు లభించడం అభినందనీయమన్నారు. చదువుతో పాటు వివిధ భాషల్లో పరిజ్ఞానం, కమ్యూనికేషన్స్ స్కిల్స్ ఉంటే విద్యార్థులు ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు మాట్లాడుతూ డిగ్రీ చదువుతూ ఫైనలియర్లో ఎక్కువ మంది విద్యార్థులకు స్టీల్‌సిటీ సెక్యూరిటీస్‌లో అవకాశాలు రావడం సంతోషకరమన్నారు. మరికొన్ని కంపెనీలు ముందుకు రానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మెగా ప్లేస్మెంట్ డ్రైవ్‌లో కళాశాల డీన్ శంకర్‌నారాయణ, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ కృష్ణకుమారి, పైడి రజని, పలువురు ప్రొఫెసర్లు, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏయూ వీసీతో కేఎస్‌బీ కార్యదర్శి భేటీ

రక్షణ రంగ ఉద్యోగులకు వర్సిటీ సహకారంపై చర్చ



వీసీతో సమావేశమైన హెచ్.పి. సింగ్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని కేంద్రీయ సైనిక్ బోర్డ్ (కేఎస్‌బీ) కార్యదర్శి కమోడోర్ హెచ్.పి. సింగ్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి, వివిధ అంశాలపై చర్చించారు. క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో రక్షణ రంగాలలో వైద్యవిభాగంలో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు డిప్లమా ఇన్ ఫార్మసీ అందించాలని ప్రతిపాదన చేశారు. ఈ దిశగా ఏయూతో ఎంఓయూ చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలిపారు. రక్షణ రంగాల ఉద్యోగుల సతీమణులకు బీఏ ఫైన్ ఆర్ట్స్ కోర్సును ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే అంశంపై చర్చించారు. రక్షణ రంగాల ఉద్యోగులకు ఏయూ పరంగా అవసరమైన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, డాక్టర్ ఉజ్వల్ కుమార్ ఘటక్, ఆర్ఎస్‌బీ డైరెక్టర్ బ్రిగేడియర్ వి.వి రెడ్డి, విశాఖ, తూర్పుగోదావరి జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీలతో మెరుగైన నైపుణ్యం



సమావేశంలో మాట్లాడుతున్న అటవీ శాఖ అధికారి రామనరేష్

డాబాగార్డెన్స్: నైపుణ్యం పెంచుకోవడానికి వక్తృత్వ పోటీలు దోహదపడతాయని అటవీ క్షేత్ర విశాఖ రేంజ్ అధికారి బిర్లంగి రామనరేష్ పేర్కొన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్రం విశాఖ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ లైఫ్ అండ్ లెగసీ ఇన్ ది ఏజ్ ఆఫ్ అమృత కాల్ పేరిట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వక్తృత్వ పోటీల్లో పాల్గొనే ఔత్సాహిక యువత విషయాన్ని సమగ్రంగా తెలుసుకోవడం, ఉపన్యాసాన్ని విశ్లేషణాత్మకంగా తయారు చేసుకోవడం, సమయపాలన, పొరపాట్లు దొర్లకుండా ఉండడానికి ముందుగా శిక్షణ పొందాలన్నారు. యుక్త వయస్సు నుంచి వక్తృత్వ పోటీల్లో పాల్గొనడం వల్ల వేదిక భయం పోతుందన్నారు. వక్తృత్వం అనగా ఏదైనా విషయం గూర్చి ఆసక్తికరంగా మాట్లాడడం లేక ఉపన్యాసం చేయడమన్నారు. తోటి వారిపై ప్రభావం చూపడంలో ఇది చాలా ఉపయోగపడుతుందన్నారు.

పార్కు నిర్మాణం కలేనా?

- ఆశగా ఎదురు చూస్తున్న పాతనగరవాసులు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



బోర్డుకే పరిమితం అయిన ఉద్యానవనం



పార్కు నిర్మించాల్సిన స్థలం

జగదాంబ: పార్కు నిర్మాణం కలగా మిగిలిపోయిందని పాతనగర వాసులు ఆవేదన చెందుతున్నారు. జీవీఎంసీ 35వ వార్డు పోర్టు దరి రామకృష్ణనగర్ వద్ద గతంలో డంపింగ్ యార్డు ఉండేది. అయితే దుర్వాసన, అపారిశుధ్యం నేపథ్యంలో యార్డును అక్కడి నుండి తరలించారు. పాత స్థలంలో పార్కు నిర్మిస్తామని జీవీఎంసీ హామీ ఇచ్చింది. అప్పటి నుంచి పార్కు నిర్మాణం మాటల్లోనే ఉండిపోయిందని.. చేతల్లోకి రాలేదని ఆ ప్రాంతీయులు చెబుతున్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకున్న రామకృష్ణనగర్‌లో పొల్యూషన్ కారణంగా అనేక మంది క్యాన్సర్ వంటి రోగాల బారిన పడి మృత్యువాత పడుతున్నారు. ఈ సమస్యకు అంతో ఇంతో పరిష్కారంగా ప్రజారోగ్యం కోసం ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పిస్తే బాగుంటుందని ఇక్కడి వారంటున్నారు. అయితే జీవీఎంసీ ఇప్పటి వరకు అటువంటి చర్యలేవీ తీసుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొల్యూషన్ కారణంగా వేసుకునే దుస్తులు.. తినే ఆహారం సమస్తం దుమ్ము, ధూళితో నిండిపోతున్నాయని చెబుతున్నారు. అయినా పోర్టు ద్వారం ఎదురుగా ఉన్న తమ వీధిలో కనీసం చెట్లు కూడా నాటలేదని అంటున్నారు. గతంలో కేవలం రామకృష్ణనగర్ మాత్రమే ఇబ్బందులు ఎదుర్కొనేదని.. ఇప్పుడు కొత్తగా నిర్మించిన టిడ్కో ఇళ్లలో నివసిస్తున్న వంద కుటుంబాల వారు కూడా సమస్యల బారిన పడ్డారని అంటున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ హార్టికల్చర్ అధికారులు స్పందించి వెంటనే పార్కు నిర్మాణం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమాలకు అడ్డాగా...

పార్కు నిర్మాణం చేస్తామన్న స్థలం ఖాళీగా ఉండిపోవడంతో పార్కులో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. కొందరు వ్యక్తులు ఎక్కడి నుండో వచ్చి రాత్రిళ్లు ఇక్కడ మద్యం, గంజాయి సేవిస్తున్నారు. అంతే కాకుండా ఈ ప్రాంతం ఇప్పుడు రౌడీషీటర్లకు అడ్డాగా మారిపోయిందని వాపోతున్నారు. వారిని ప్రశ్నించే ధైర్యం లేక ఇళ్లలోనే ఉండిపోతున్నామని చెబుతున్నారు.

అనారోగ్యాలకు గురవుతున్నాం

పొల్యూషన్ కోరల్లో చిక్కుకుని అనారోగ్యాలకు గురవుతున్నాం. ఇప్పటికే ఇంటికొక్కరు.. ఇద్దరు చొప్పున వ్యాధిగ్రస్తులున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా స్పందించి పార్కు నిర్మాణం చేయాలి.

–ఆలేటి వెంకటరావు, రామకృష్ణనగర్

నివేదిక ఇచ్చాం...



ప్రజల ఆరోగ్యం, ఆహ్లాదం కోసం పార్కు నిర్మించాలని జీవీఎంసీ అధికారులకు నివేదిక ఇచ్చాం. పరిస్థితులను బట్టి పార్కు నిర్మిస్తారు. అప్పటి వరకు వేచి ఉందాం.

–విల్లూరి భాస్కరరావు, 35వ వార్డుకార్పొరేటర్

సంక్రాంతి సందడి



చెరకు, పాల కుండల చుట్టూ వేషధారణల్లో విద్యార్థులు



సోది చెబుతున్న చిన్నారి

ఆరిలోవ: పాఠశాలల్లో సంక్రాంతి సందడి మొదలైంది. జాతీయ రహదారి పక్కన రూరల్ రెవెన్యూ కార్యాలయం సమీపంలోని విశాఖ వ్యాలీ స్కూల్‌లో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణాన్ని పచ్చని తోరణాలు, వివిధ రకాల రంగుల పూల దండలలో అలంకరించారు. ఎల్‌కేజీ నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంబరాల్లో పాల్గొని కేరింతలు కొట్టారు. పాఠశాల ఆవరణ పాటలు, నృత్యాలు, రంగవల్లులు, పిల్లలు భోగిపళ్లు పోయడం, హాస్య నాటికలు ప్రదర్శనతో సందడిగా మారింది. విద్యార్థులు హరిదాసులు, సోది చెప్పే మహిళలు, గంగిరెద్దుల ఆడించే వాళ్లు, గిలకల వాళ్లు తదితర వేషధారణలతో పల్లెటూరి వాతావరణాన్ని కళ్ల ముందుకు తీసుకొచ్చారు. ఓ చిన్నారి సోది చెప్పే మహిళ వేషధారణలో తోటి విద్యార్థులకు సోది చెబుతూ ఆకట్టుకుంది. ప్రిన్సిపాల్‌తోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కలిసి ఉత్సాహంతో సంప్రదాయ నృత్యాలు చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు అందరినీ ఆకట్టుకుంది. పల్లెల్లోని రైతులు తమ ఇళ్లల్లో తయారు చేసుకునే అరిసెలు, లడ్డూలు, పూతరేకులు, జంతికలు, కాజాలు, మినప సున్నుండలు పొంగలి తదితర వంటకాలను ప్రదర్శించి వాటి ప్రాధాన్యం గురించి విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఈశ్వర ప్రభాకర్ వివరించారు. సంక్రాంతి పండగ ప్రాధాన్యం గురించి తెలిపేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

అంగన్‌వాడీ చిన్నారులను ప్రేమతో చేరదీయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గొండు సీతారాం

అల్లిపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లోపిల్లలను ప్రేమ, ఆప్యాయతలతో చేరదీయాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. నగర పర్యటనలో ఉన్న ఆయన శనివారం విశాఖ ఐసీడీఎస్ అర్బన్–2 చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీలత ఆధ్వర్యంలో అల్లిపురం, కుమ్మరవీధి సామాజిక భవనంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని సిబ్బంది అక్కడి పిల్లలపై వికృత చేష్టలతో అన్ని రకాలుగా వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఇది బాలల హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందన్నారు. ఇటువంటి వాటికి పాల్పడేవారిని తక్షణమే ఉద్యోగాల్లో నుంచి తొలగించేలా సంబంధిత శాఖల అధికారులకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు జారీ చేస్తుందన్నారు. అదే విధంగా పిల్లలను, సిబ్బందిని పర్యవేక్షించే బాధ్యతను సంబంధిత స్త్రీ, శిశు సంక్షేమ అధికారులు తీసుకోవాలని ఆదేశిస్తున్నామన్నారు. పిల్లల హక్కుల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించే అధికారులపైనా క్రమశిక్షణ చర్యలతో పాటు క్రిమినల్ చర్యలను సిఫారసు చేయనున్నట్లు తెలిపారు. అర్బన్–2 ,చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీలత మాట్లాడుతూ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సూచించిన విధంగా పిల్లలపై ప్రేమను, వారి తల్లిదండ్రుల అభిమానాన్ని చూరగొనే విధంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు నిపుణులతో సదస్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్, అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్లు ఉమా జానకి, లావణ్య, మహిళా సంరక్షణ కార్యదర్శులు వై.శ్రావ్య, ఎ.రాధ, ఎండీ నూర్జహాన్, జి.హారిక దీప్తి, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం నగర కన్వీనర్ కె.ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు

ప్రతి ప్రయాణం కొత్త పాఠం



అమరేంద్రను సత్కరిస్తున్న అతిథులు

సీతంపేట: తాను చేసిన ప్రతి ప్రయాణం నుంచి కొత్త పాఠం నేర్చుకున్నానని ప్రముఖ యాత్రా సాహిత్య రచయిత దాసరి అమరేంద్ర అన్నారు. విశాఖ సంస్కృతి మాసపత్రిక ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆయన రచించిన 'గల్ఫ్ గీతం', 'గల్ఫ్ యాత్రాగాథ' పుస్తక పరిచయ సభ జరిగింది. ఈ సందర్భంగా రచయిత మాట్లాడుతూ ప్రయాణాలు చేయడం వల్ల కొత్త ప్రదేశాలు చూడటంతో పాటు ఆయా ప్రాంతాల చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు తెలుస్తాయన్నారు. గల్ఫ్ దేశాల ప్రజల జీవన శైలిని అధ్యయనం చేయడానికి గల్ఫ్‌కు వెళ్లానని, యాత్రా సాహిత్యానికి సంబంధించి ఇప్పటి వరకు ఏడు పుస్తకాలు రాశానని తెలిపారు. గల్ఫ్‌లో తాను చూసిన ప్రదేశాలు, తనకు తారసపడిన మనుషులు, మనస్తత్వాల గురించి పుస్తకంలో వివరించారు. ప్రముఖ రచయిత్రి కేఎస్ మల్లీశ్వరి పుస్తకాన్ని సమీక్షించారు. ప్రముఖ అనువాద రచయిత ఎల్.ఆర్.స్వామి ఆధ్యక్షతన జరిగిన సభలో రచయిత అడపా రామకృష్ణ, విశాఖ సంస్కృతి సంపాదకుడు శిరేల సన్యాసిరావు, పలువురు రచయితలు పాల్గొన్నారు.

మత్స్యకారులకు న్యాయం చేయాలి



మంత్రి అప్పలరాజుకు వినతిపత్రం అందజేస్తున్న కొండబాబు

మహారాణిపేట : వివిధ కారణాల వల్ల నష్టపోయిన మత్స్యకారులకు న్యాయం చేయాలని కోస్టల్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బర్రి కొండబాబు కోరారు. శనివారం ఫిషింగ్ హార్బర్‌లో రూ.2.75 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆధునాతన చేపల మార్కెట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజును కలిసి వినతిపత్రం సమర్పించారు. తుపాన్లకు మునిగిపోయిన బోట్లు, ఒడ్డు ఎక్కి పనికిరాకుండా పోయిన బోట్లు, కాలిపోయిన 35 బోట్లకు నష్టపరిహారం ఇవ్వాలని మంత్రికి సమర్పించిన వినతిపత్రంలో కొండబాబు కోరారు. అలాగే 2019 జూన్ నుంచి నవంబర్ వరకు ఆరునెలల డీజిల్ ఆయిల్ విడుదల చేయాలని కోరారు. అనంతరం మంత్రిని కొండబాబు తదితరులు సన్మానించారు.

ఆంగ్లో ఇండియన్లకు ప్రభుత్వం అండ

- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- 47 మంది ఆంగ్లో ఇండియన్ లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ
- సీఎం జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు



ఆంగ్లో ఇండియన్ లబ్ధిదారులకు పెన్షన్ అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

బీచ్‌రోడ్డు: ఆంగ్లో ఇండియన్లను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. బీచ్ రోడ్డులోని ఒక హోటల్‌లో శనివారం ఆంగ్లో ఇండియన్స్ కమ్యూనిటీ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్లో ఇండియన్ల సంక్షేమానికి అవసరమైన అన్ని రకాల పథకాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. అందులో భాగం తొలి విడతలో 47 మంది ఆంగ్లో ఇండియన్ లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు చేసినట్లు తెలిపారు. వారిలో 37 మంది విశాఖవాసులే ఉండటం హర్షనీయమన్నారు. రెండో విడతలో 75 మంది దరఖాస్తు చేసుకున్నారని, త్వరలో వారికి కూడా పింఛన్ మంజూరు చేస్తామని చెప్పారు. రాష్ట్ర విభజన తరువాత ఏపీలోని చట్ట సభల్లో ఆంగ్లో ఇండియన్లు ప్రాతినిధ్యం వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా లబ్దిదారులకు ఎమ్మెల్యే వాసుపల్లి పెన్షన్ సొమ్మును అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పి.ఉషశ్రీ, అసోసియేషన్ కార్యదర్శి జూన్ గాల్యాట్, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గుర్తించింది..

ఆంగ్లో ఇండియన్స్ కమ్యూనిటీ అసోసియేషన్ అధ్యక్షులు ఎడ్వర్డ్ లాజరో మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆంగ్లో ఇండియన్ కమ్యూనిటీ సరిఫికెట్ జారీ కోసం జీవో ఉండేదని గుర్తుచేశారు. 2014లో రాష్ట్ర విభజన తరువాత ఏపీలో ఆ జీవో మార్పు చేయాల్సి వచ్చిందన్నారు. ఇందు కోసం 2014 నుంచి అనేక సార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్న పట్టించుకోలేదని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత తమ సమస్యపై ఒకే సారి వినతిపత్రం అందజేశామని తెలిపారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తమను గుర్తించి కమ్యూనిటీ సర్టిఫికెట్‌ను జారీ చేసేందుకు జీవో విడుదల చేసిందని చెప్పారు. ఈమేరకు ఎడ్వర్డ్ ఆనందం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఏయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన 2023 సంవత్సరం క్యాలెండర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, పల్సస్ గ్రూప్ సీఈవో డాక్టర్ జి.శ్రీనుబాబు, హెచ్ఆర్‌డీసీ సంచాలకులు ఆచార్య టి.వి కృష్ణ, డాక్టర్ జి.రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలియుగ వెంకన్నకు విశేష పూజలు

కంచరపాలెం: స్థానిక తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథ శర్మ ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు చేశారు. పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్నకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన చేశారు.